సృష్టిలో తీయనిది

అప్పుడే విచ్చుతున్న చారడేసి కళ్ళతో, పాలుగారే బుగ్గలతో, దానిమ్మ గింజలాంటి నవనవలాడే శరీరచ్ఛాయతో, కమలా తొనలలాంటి మృదుత్వంతో, మంచులో తడిసిన మల్లి పువ్వులా, అప్పుడే వెలసిన దేవతలా కేరింతలు కొడుతున్న పాపాయిని చూచి నిట్టూర్చాను నేను. నిరాశగా, నిర్లిప్తంగా, పదే పదే చెమ్మగిల్లుతున్న కళ్ళతో ఉయ్యాలలో పాపకేసి చూస్తున్న విజయవైపు తిరిగి అన్నాను.

"చూడు, విజయా, నీవైపెంత అమాయకంగా, సుకుమారంగా చూస్తూందో పాప!" పేలవంగా నవ్వింది విజయ.

"ఔను, నీలాగే అందంగా ఉంది పాప. మనం వుంచేసుకోకూడదూ విజ్జీ?"

నావైపు కోపంగా చూచింది విజయ. తరువాత కళ్ళలో నీళ్ళు నింపుకుంటూ అంది. "నాకు తెలుసు, నాకు తెలుసు, మొత్తానికి ఈ పాపనే నా చేతుల్లో పెడతావు,

నాకు బాగా తెలుసు. ఆఖరికి ఆ పరీక్షలు, యీ పరీక్షలు చేసి, "ఈ పిల్లే నీ బిడ్డ" అని ఒక్క మాటలో తేలిగ్గా తేల్చి పడేస్తారు. కానీ...కానీ, నీకర్థం కాదు రాజీ! నా రక్తం ఈ గుడ్డులో లేదు... అహఁ నీకర్థం కాదు. మాతృత్వం గురించి నీకింకా అనుభవం కాలేదు." ఆమె కంఠంలో గాజు రాళ్ళు గల గల లాడాయి.

• • •

ఆ రోజు సృష్టిలో మరో విచిత్రం జరిగిపోయింది. ఒక మామూలు ఆస్పత్రిలో మా విజయను కాన్పుకు చేర్చ వలసి వచ్చింది. విజయ ప్రసవించిన క్షణంలోనే మరో ఆవిడ కూడా పురుడు పోసుకుంది. ఇద్దరికీ కాన్పు చేసే హడా విడిలో ఆ గందరగోళంలో మిడ్ వైఫ్ ఇద్దరికీ మగపిల్లలని చెప్పేసింది. కాని అంతా సర్దుకున్నాక ఆడపిల్లని తెచ్చి మా విజయ ఒడిలో వేస్తే, "ఈ పిల్లనెందుకు నా పక్కలో వేస్తున్నావు?" అన్నట్టు వెర్రిగా చూచింది. ఆ చూపుల కర్థం తెలిసిన మిడ్ వైఫ్ నెమ్మదిగా చెప్పింది. "క్షమించండి. గాభరాలో మీకు మగపిల్లాడని చెప్పాను. కానీ, మీ బిడ్డ ఆడపిల్ల."

విజయ ఆ విషయాన్ని ఎంతమాత్రం నమ్మలేదు. ఎక్కడో మోసం జరిగిపోయిందని గోల పెట్టింది.

పదేళ్ళ తరువాత వచ్చిన యీ కాన్పు విజయకు ఎంతో విలువైనది. అపూర్వ వరంలా మాతృత్వాన్ని ప్రసాదిస్తున్న

తన గర్భస్థ శిశువుమీద మితిలేని, మమకారాన్ని పెంచుకుంది. పుట్టబోయే శిశువు మగ బిడ్డే అయివుంటాడనీ, వాడు తమను పున్నామ నరకం నుండి రక్షిస్తాడనీ చిత్రమైన నమ్మకాన్ని పెంపుకుంది ఏ భాగ్యవశం చేతనో తన కోరిక నెరవేరిందని మురిసి పోయింది. కాని ఈ క్షణాన కర్యారంలో ఆ కల కరిగి పోయింది. తను నిజమని గాఢంగా నమ్ముతున్న దానిని అందరూ చేరి అబద్ధమని తనచేత నమ్మించాలని చూస్తుంటే ఆమె తట్టుకో లేక పోయింది.

మొదటే ఆడపిల్ల అని చెప్పివుంటే 'నాకు ప్రాప్తమింతే' నని సంతృప్తి పడివుండేది. కాని, ఆశను క్షణాల మీద నిరాశగా మార్చుకోవడంలో, పైగా ఏదో మోసం జరిగిపోయిందనే అపనమ్మకంలో పిచ్చిదై పోయింది విజయ. ఇందులో మిన్ వైఫ్ దోషం కూడా లేదు. ఒక్క చేతిలో ఇద్దరు శిశువుల్ని యీ భూమిమీద పడేసే గాభరాలో దొర్లిపోయిన చిన్న పొరపాటది. కాని విజయ మాత్రం మిన్ వైఫ్ని క్షమించలేక పోయింది.

ఆగర్భ శ్రీమంతురాలయిన విజయ కోర్టులో దావా వేసింది. అది విని ఆ రెండవ ఆవిడ భయపడింది. ఆ బీద బతుకుకూడా అది విలువయిన కడుపు పంట! తనూ మగ పిల్లవాడినే కోరుకుంది. మొత్తానికి తనది కాదంటున్న ఇద్దరు తల్లుల మధ్య పుట్టుకతోనే దురదృష్ట వంతురాలైంది ఆ పసిపిల్ల.

దావా ఫలితంగా రక్త పరీక్షల నిమిత్తమై తలిదండ్రుల్ని, బిడ్డ తల్లుల్ని వాళ్ళ స్థితి గతుల ప్రకారం గదులు ఇవ్వబడ్డాయి. రెండు మూడు రోజులు మగ పిల్లవాడు దొంగిలించబడకుండా పోలీసు కావలా కూడా వుంచారు. ఆ హట్టహాసమంతా చూసి నేననుకున్నాను. "పుట్టుకతోనే మగవలుసుకెంత గిరాకీ!" అని.

o o o

ఇంకా చీకటి వలచబడక ముందే ఉలికి పడ్డట్టు పక్కమీద నుంచి లేచి గబగబా మెట్లు దిగుతున్న విజయను నేనూ అనుసరించాను. నేరుగా మగపిల్లవాడి ఉయ్యాల దగ్గరికి వెళ్ళి, తదేకంగా వాడినే చూస్తూ శిల్పి చెక్కిన శిలలా నిలబడిపోయింది విజయ.

"ఇలాంటి ఘోరం జరుగుతుందని తెలియక ఇన్ని నెలలూ వీడిని నా కడుపులో దాచి పెంచాను రాజీ!" తెగిన ముత్యాలహారంలా ఆమె చెంపల మీదుగా కన్నీళ్ళు కారి పోతున్నాయి.

"ఛీ ఛీ! ఇదేమిటి? కళ్ళు తుడుచుకో. తల్లి నమ్మకాన్ని ఎవరూ అన్యాయం చెయ్యలేరు. భయపడకు విజ్జీ."

విజయ ఏడుపుకు సానుభూతిగా ఉయ్యాలలో 'కేర్-కేర్'మని ఏడవడం మొదలెట్టాడు. విజయ వాడిని ఎత్తుకునే లోపలే [illegible] పరుగున వచ్చి వాడిని ఎత్తుకుని పక్కకి వెళ్ళిపోయింది. [illegible] ఆమె వైపు, బిడ్డవైపు అసహా

యంగా చూడడం తప్ప ఏం చెయ్యలేకపోయింది విజయ. ఐదేళ్ళు వచ్చేవరకు మగబిడ్డను కాళిందికి, ఆడబిడ్డను విజయకు గార్డియన్ గా నియమించారు. అప్పుడప్పుడు బాధ్యతగా ఆడపిల్లకు పాలు పట్టినా, కాళిందికి తెలియకుండా మగపిల్లవాడికి చాటుగా పాలు పట్టవచ్చేది విజయ. ఒకరోజు పాలవేళ దాటిపోయి ఆకలితో గుక్కపెట్టి ఏడుస్తున్న పాపకు పాలు కలుపుతూ బాధగా అన్నాను నేను.

"మీ బాధల్లో సమస్యల్లో పసిపిల్లకు అన్యాయం చేస్తున్నారు విజ్జీ" అని. అప్పటినుండి విజయ పాపపోషణలో లోపం రానియ్యకుండా సర్వసేవలూ చేసింది.

"చూడు చూడు! నా బిడ్డనెలా నలిపేస్తుందో చూడు" అంది. ఉలిక్కిపడ్డాను నేను. అంత దూరాన నేలమీద చతికిలబడి మగబిడ్డకు పాలిస్తున్న కాళిందిని వైరంగా చూస్తోంది విజయ.

జాలిగా నవ్వుకున్నాను నేను. ఆ బిడ్డకొరకు తపించే ఆ తల్లి - ఆ బిడ్డనెందుకు నలిపేస్తుంటుంది! అలా ఇద్దరు తల్లుల కళ్ళూ ఒకే దృశ్యాన్ని, ఒకే బిడ్డను చూస్తున్నాయి. చటుక్కున పాపవైపు చూశాను. అలా నిశ్చలంగా కదులుతున్న జాలి గొలిపేలా తన ఆల్చిప్పలాంటి కళ్ళను అటూ ఇటూ తిప్పుతూంది. ఆ పిల్లను చేతుల్లోకి తీసుకున్నాను.

"మీరిద్దరు కొట్లాడుకుంటున్న యీ పిల్ల పుట్టుకతో నే ఎంత

దురదృష్టవంతురాలైంది." నా గొణుగుడికి జవాబుగా నిర్ద యంగా చెప్పింది విజయ.

"ఈ పాప మీద నీకంటే ఎక్కువగానే నాకు సానుభూతి వుంది రాజీ! కానీ ఆ సానుభూతితో యీ పిల్లను నా స్వంత బిడ్డ అనుకోవడానికి నేను సామాన్యమైన తల్లిని."

విజయ తనను తాను సమర్థించుకుంటూంటే నాకు కోపం వచ్చి కొద్దిగా ఘాటుగా అన్నాను. "అసలు రహస్యం చెప్పు. ఆ పిల్ల ఆడపిల్లయి పుట్టటమే అది చేసిన దోషం" అంటున్నట్టు తల అడ్డంగా ఊపింది విజయ.

"ఆడపిల్ల అయినా, మగబిడ్డ అయినా నా రక్తం నాకు కావాలి." ఆమె కంఠం గాద్గదికమైంది. ఆ స్వరానికి విచలితమైన నా ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ అనునయంగా అన్నాను:

"చూడు, విజయా! నీకు అవసరాలకు మించిన డబ్బుంది. కాళిందిలాగ 'ఈ పిల్లను ఎలా వెళ్ళబుచ్చుకోవాలా?' అనే బెంగగాని 'ఎవ్వర్తో పెళ్ళవుతుందో' అనే బాధగాని ఉండవు. నువ్వు తలచుకోవాలేగానీ నీ బిడ్డను నీ దగ్గిరే ఉంచుకోగలవు నువ్వు. కాళింది విషయం అలా కాదు. వాడిని కన్నప్పటినుండి వాడు పెరిగి పెద్దవాడై తనను పోషించే కాలాన్ని గురించి ఊహించుకుంటూ బ్రతుకుతుంది." తిరస్కారంగా చెప్పింది విజయ.

"స్వంత బిడ్డను పరాయివాళ్ళ చేతికి అప్పగించి, పరాయి బిడ్డను పెంచి పెద్ద చేయగల ఉదారత్వమూ, సంస్కారమూ నాలో లేవు."

"ఈ పిల్ల పరాయి పిల్లంటావా?"

"నా బిడ్డ మాత్రం కాదు."

విజయ విశ్వాసానికి విస్తుపోయాను నేను. ఆమె నమ్మకంలో నాకొక అనుమానం కలిగింది. వెంటనే పాపను ఉయ్యాలలో పడుకోబెట్టి గబగబా కాళింది దగ్గరికి వెళ్ళి, పక్కనే స్టూల్ మీద కూర్చుంటూ నచ్చచెప్పే ధోరణిలో ఆమె నుండి విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తితో అన్నాను.

"చూడు, కాళిందీ! నువ్వు మగపిల్లాడు కావాలనుకున్నావు. ఆడపిల్ల పుట్టినంత మాత్రాన కన్న బిడ్డను పారేసుకుని ఎవరి బిడ్డనో పాలిచ్చి సాకుతావా!"

కాళింది తడి కళ్ళతో భయం భయంగా చూస్తూ, తన బిడ్డను ఎక్కడ లాక్కుపోతానో అన్నంత గట్టిగా వాణ్ణి హృదయానికి హత్తుకుని తల అడ్డంగా ఊపింది. ఆ కళ్ళలో భయంతో పాటు తన బిడ్డను తాను రక్షించుకోవడానికి ఎటువంటి సాహసం చేయడానికైనా జంకని స్థైర్యం ఉంది.

ఇద్దరి నమ్మకాలలోనూ ఆత్మ విశ్వాసం ఉంది.

కొన్ని రోజుల తరువాత అన్ని పరీక్షలూ చేసి, ఆడ

పిల్లలో వున్న రక్తం గ్రూపుకీ, విజయా, విజయ భర్తలో వున్న రక్తం గ్రూపుకీ సరిపోయిందని తేల్చి, విజయఅన్నట్టు ఆఖరికి ఆడపిల్లను విజయ చేతిలో పెట్టారు. ఆ క్షణంలో విజయను చూసిన నా హృదయం ద్రవీభవించింది. సమస్తమైన కోర్కెలపట్లా ఆసక్తి పోయినట్టూ, సమస్త జీవకళా హరించుకుపోయినట్టూ, అనుభూతులన్నీ ముద్దగట్టుకు పోయినట్టూ పేదదానిలా కలిచిపోయిందామె.

కాళింది వెళ్ళి పోయేరోజు ఆమెను బ్రతిమిలాడి వాళ్ళ అడ్రసు తీసుకొని, వాడిని చూడటానికి అప్పుడప్పుడు వచ్చేందుకు అనుమతి తీసుకుంది విజయ. కాని, అంతా సర్దుకున్నాక కాళింది అడ్రసు ప్రకారం వాళ్ళ ఊరు వెళితే అక్కడనుండి వాళ్ళు వెళ్ళి పోయారని తెలిసింది. డబ్బుగలవాళ్ళు డబ్బుతోని వాళ్ళను ఏమైనా చెయ్యగలరనే నమ్మకం బహుశ కాళిందిలో బలంగా ఉండి వుండవచ్చు. ఆ నమ్మకంతోనే తను పుట్టి పెరిగిన గడ్డను, తన బిడ్డ కోసం శాశ్వతంగా విడిచి పారిపోయిందామె. ఆ తరువాత కూడా విజయ, వాళ్ళ ఉనికిని తెలుసుకోవడానికి చాలా ప్రయత్నాలు చేసింది. అంత స్తబ్దంగా వుండిపోయిన భర్త దగ్గర నుండి ఆమెకు ఏటువంటి సానుభూతి, సహాయము లభించలేదు.

విజయ అత్తగారి వూరే నా అత్తగారి ఊరు అవడంతో అప్పుడప్పుడు విజయను కలుసుకుంటుండేదాన్ని. మొదటి రోజులలో విజయ గతాన్ని పూర్తిగా మరచిపోయిం

దని సంతోష పడ్డాను. కాని, కొన్ని రోజులలోనే అది వట్టి భ్రమ అని తేలిపోయింది. కూతురు జ్యోతిని బడికి పంపించి, ఉన్నట్టుండి అడిగేది; "వాడిప్పుడు ఏం చదువుతూ ఉంటాడంటావు, రాజా!"

"చదువుతున్నారో లేదో!" కళ్ళనిండా నీళ్ళు వంపుకునేది.

"ఒక్కమారు.... ఒక్కమారు చాలు. ఇప్పుడు వాడిని నేను చూడగలిగితే...!"

"ఎందుకులే, విజ్జీ, పేరాశలు!" అని నేనంటే."ఏమిటి పేరాశ? నా బిడ్డను నేను చూచుకోవాలనుకోవడం పేరాశా?" అంటూ ఆవేశపడే విజయ నా కలవాటయి పోయింది.

నా కప్పుడనిపిస్తుంటుంది- ఆనాటి ఆ పిల్ల వాడు దగ్గిర దగ్గిర పాతికేళ్ళ తరువాత ఈ రోజు చింపిరి గుడ్డలతో మొకుగు లేని సంస్కారంతో విజయ ఎదురుగుండా నిల్చుంటే, 'నా బిడ్డ' అని వాడిని హృదయానికి హత్తుకోగలదా?

ఒకవేళ 'కేసు' మేము గెల్చివుంటే జ్యోతిస్థానం ఎలా వుండేదో? అప్పుడు వాడు ఇక్కడ సర్వ భోగాలు అనుభవించేవాడు. అప్పుడప్పుడు విజయ ఉన్నట్టుండి నిశ్శబ్దంగా అయిపోయి, కంట తడి పెట్టడానికి కారణం అదే అయి వుంటుంది. జ్యోతికి తినిపించే నేయి వేసిన గోరు ముద్దల్లో తన కొడుకు తినే కొంది కారం మెతుకులు కనిపించేవేమో! అప్పుడప్పుడూ కొడుకు జ్ఞాపకాల్లోకి జారి

పోయినా, మమతనీ, మంచితనాన్నీ రంగరించి పోసి జ్యోతిని పెంచింది.

ఆమె పెంపకంలో జ్యోతి విశిష్టమయిన వ్యక్తిత్వాన్ని, జీవితంపట్ల స్పష్టమయిన దృక్పథాన్ని అలవరచుకుంది. తల్లి దగ్గర పాఠాలు నేర్చుకున్న ఆమె జ్ఞాననేత్రం జ్యోతిర్మయమయింది. ఆమెను చూస్తే నా కనిపిస్తూంటుంది, సంస్కారం జన్మగతంగా వస్తుందా? లేక పరిసరాలవల్ల వస్తుందా అని.

ఆ రోజు జ్యోతి కెమిస్ట్రీలో డాక్టరేట్ పొందింది, గవర్నమెంటు స్కాలర్‌షిప్‌తో విదేశానికి వెళుతున్న సందర్భంలో మా విజయా వాళ్ళింట్లో అనవసరమయిన అట్టహాసాలతో విందు జరుగుతోంది. పార్టీలో స్నేహితులందరూ జ్యోతిని అదృష్టవంతురాలని ఆకాశానికెత్తేస్తున్నారు.

"నీ అదృష్టాన్ని తలుచుకుంటుంటే నాకు అసూయగా ఉంది జ్యోతీ. కాలు కింద పెట్టకుండా పెరిగావు. అదేమి చిత్రమో సరస్వతీదేవి కటాక్షం కూడా నీ స్వంతమే చేశాడు భగవంతుడు. దానిమీద అదృష్టదేవత వరమిచ్చినట్టు పై స్కాలర్‌షిప్ వచ్చింది." స్నేహితురాలి మాటలకు సన్నగా నవ్వింది జ్యోతి.

"చూడు, జ్యోతీ! నువ్వు కనిపెట్టవలసింది మానవుడి నాగరికతను పెంచడానికి సహాయం చేసే ఆసిడ్, ఆల్కలీ కలయికలో వచ్చే బ్రహ్మాండమయిన రసాయనిక పదార్థాల్ని

గానీ, మాలిక్యూల్‌ని, అటమ్‌నీ భరతనాట్యాలు చేయించి సృష్టించే మహా శక్తుల్ని గాని కాదు. మనిషి శాంతిగా బ్రతకడానికి కావలసిన కిటుకేమిటో శాస్త్ర పరిశోధన చేసి చెప్పాలంటే మే మందరం నీకు ఋణపడి ఉంటాం." ఈ నాగరిక జీవితంలో విసిగిపోయిన స్నేహితురాలికి జవాబుగా కళ్ళతో నవ్వింది జ్యోతి.

అక్కడే నిలబడి అన్నీ వింటున్న విజయ కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి. ప్రతిభావంతమైన చిరునవ్వుతో, కరుణామయమైన నేత్రాలతో దీక్షిత ప్రతిమలా వున్న కూతుర్ని చూచి సంతృప్తిగా నిట్టూర్చిందామె.

"నా చేతుల్లో పెరిగిన యీ పిల్ల నాకే నాడూ అవమానం కలిగించే పనులు చెయ్యలేదు. ఒక్కరోజైనా నన్ను క్షోభ పెట్టలేదు. గబ గబా ఒక్కొక్క మెట్టే ఎక్కిపోయి, ఈ రోజు విజ్ఞాన సముపార్జన కొరకు పరదేశాలకు కూడా వెళ్ళిపోతోంది." లోకంచేత తన బిడ్డగా గుర్తించబడుతున్న జ్యోతిని తలుచుకుని గర్వపడుతున్న విజయ దగ్గరికి జ్యోతి స్నేహితురాలి అమ్మ వచ్చి అభినందనగా చూస్తూ అంది: "ఎంతో అదృష్టవంతులు మీరు. ఎన్ని పూజలు చేసుకున్నారో- జ్యోతి మీ కడుపున పడింది."

నవ్వుతున్న విజయ ముఖం వెల్లబడిపోయింది. ఆమె కళ్ళ ఎదుటగుండా ఒక తెర పడిపోయింది.

"ఏం చేస్తుంటాడు వాడిప్పుడు? బహుశా ఏ ఆఫీసులోనో యల్. డి. సి. క్లర్కుగానో, లేకపోతే ఎవరింట్లోనో పాలేరుగానో..." అలా ఆలోచించడానికి ఆమె అంతర్యం ఒప్పుకోలేదు. యథాప్రకారంగా తను భద్రంగా అల్లి పెట్టుకున్న ఊహల తాలూకు అందమైన కలలోకి వెళ్ళిపోయింది. "ఎవరో పుణ్యాత్ముడు రాజకుమారుడులా వున్న ఆ పేదింటి కాలింది మారుటి బిడ్డను చూసి, జాలి తలచి పెద్ద చదువులు చెప్పిస్తాడు. వాడుకూడా పెద్దడాక్టరో, సైంటిస్టో అయిపోతాడు విదేశం వెళ్ళి మరో పది డిగ్రీలు తెచ్చుకుంటాడు." ఆమె కళ్ళు క్షణకాలం మెరిసి ఆరిపోయాయి. అబద్ధాన్ని నిజం చేసుకోవడానికి కూడా ఆమెకు సత్తువ చాలడం లేదు.

ఉన్నట్టుండి పరధ్యానంలో పడిపోయిన విజయను చూసి ఏమీ అర్థంగాక తికమక పడింది, విజయను అభినందించిన ఆ పిల్లలు.

పార్టీనుండి అందరూ వెళ్ళిపోయాక అలసిపోయిన జ్యోతి తల నిమురుతూ అన్నాను:

"నువ్వు ఇంతదానివయ్యావంటే నాకు చాల సంతోషంగా ఉంది పాపా! పై దేశం వెళుతున్నావు. వాళ్ళ అలంకారాలన్నీ, ఫ్యాషన్లనీ కాకుండా వాళ్ళ పంక్చువాలిటీ, సహాయపడటం నేర్చుకుని రా, తల్లీ!"

"అలాగే, పిన్నీ!" విందుగా నవ్వింది జ్యోతి.

"నీ యీ అదృష్టాన్ని చూడటానికే నే నిన్నిరోజులూ ఎదురు చూశాను, పాపా!" ఉలిక్కిపడింది జ్యోతి.

"నువ్వు నన్ను అదృష్టవంతురాలి నంటున్నావా, పిన్నీ!"

ఇన్ని ఏళ్ళలో మొదటి మారుగా ఆవిశాలమయిన కళ్ళల్లో నీటిపొరను చూశాను.

"ఏమయింది, జ్యోతీ! నీకేం తక్కువయింది?" ఆమె కళ్ళనీళ్ళను నా పమిట చెంగుతో తుడుస్తూ అన్నాను.

"నా అదృష్టమేమిటో నాకు బాగా తెలుసు పిన్నీ! తల్లి చేత బిడ్డగా గుర్తించబడకపోవటమే అదృష్టమైతే అదే నువ్వు నాకు ఆశీర్వదిస్తావా, పిన్నీ!"

విస్తుపోయాను నేను. "ఇంతకాలం ఈ పిల్లకు తన పుట్టుక వెనుకన సమస్యలు తెలియవనే అనుకున్నాను నేను. ఆనాటి దురదృష్టపు పసిపిల్ల పెరిగి పెద్దదై అదృష్టవంతురాలుగా గుర్తించబడితే చూడాలని ఎదురు చూశాను. ఇప్పుడేమయింది? ఎలా తెలిసిపోయిం దీమెకు!"

"ఇటువంటి విషయాలేవీ దాగాలన్నా దాగవు పిన్నీ!" ఆమె కంఠం కొద్దిగా వణికింది.

"కాదు, కాదు పాపా! నువ్వు, వాళ్ళూ వీళ్ళూ చెప్పే మాటలు నమ్మి..."

నన్ను మధ్యలోనే ఆపుతూ తల అడ్డంగా ఊపింది జ్యోతి.

"నేను ఎవరి మాటలో నమ్మి, వాటిని నీముందు ప్రదర్శించుకునేంత మూర్ఖురాలి నంటావా, పిన్నీ?"

నేను జవాబు చెప్పేలోపలే తిరిగి తనే మొదలెట్టింది.

"కన్నతల్లిగాని పెంచిన తల్లిగాని నాకు తెలిసింది ఒక్క అమ్మమాత్రమే! ఒక వేళ ఈమె నా కన్నతల్లి కాకపోయినా, కనని దోషానికి, పెంచిన మమకారాన్ని కాదని, కన్నతల్లిని వెతుక్కుంటూ పోయే మూర్ఖత్వాన్ని మా అమ్మ నాకు నేర్పలేదు. కాని పిన్నీ, అమ్మ నన్ను మనస్ఫూర్తిగా గుర్తించడం లేదని అనిపించినప్పుడు మాత్రం నా సర్వం అశాంతితో గిల గిలలాడిపోతుంది పిన్నీ!"

ఆమె కళ్ళలోనుండి ముత్యాల్లాంటి కన్నీళ్ళు రాలి నా ఒడిలో ఇంకిపోయాయి. అశాంతి తను అనుభవించే ధోరణిలో అన్నాను.

"నువ్వు పొరబడుతున్నావు, పాపా! విజయ నిన్ను అపురూపంగా పెంచింది ప్రాణానికి ప్రాణంగా చూసుకుంది. విద్యాబుద్ధులు చెప్పించింది. ఈ రోజు నువ్వు ఇంతదానివై ఇలా నిలబడ్డావంటే అదంతా మీ అమ్మ ఆశీర్వాదం చలవే."

ఒక్క క్షణం మౌనం తరువాత అంది జ్యోతి,

"నిజమే పిన్నీ! నిజానికి నేను ఆమెకెంతో ఋణపడి

ఉండాలి. కాని, నాకలా అనిపించదు. ఆమె అమ్మ, నేను
కూతుర్ని అనే భావమే ఉంటుంది నాకు. నా చిన్నతనం నా
కింకా బాగా గుర్తుంది. అమ్మ ఆడించేది. నాతో ఆడేది. నన్ను
అందంగా అలంకరించడానికి గంటలు గంటలే తీసుకునేది.
కొసరి కొసరి గోరుముద్దలు తినిపించేది. నా ప్రతి కదలికనూ
కొండంతలు చేసి ప్రతివాళ్ళకీ చెప్పి ఆనందించేది. నేను
పరీక్ష పాసైతే ఆమె కళ్ళలో మెరుపు మెరిసేది. అమ్మ ఒడ్లో
ఉంటాను నేను. కాని, పిన్నీ! ఆడుతూ ఆడుతూ అల్లంత
దూరాన నిలబెట్టి ఆలోచనల్లోకి జారిపోతుండేది. అన్నం తిని
పిస్తూ తినిపిస్తూ నోటిదాకా పెట్టిన ముద్దను కంచంలో వదిలేసి
అలా మౌనంగా ఉండిపోయేది. నాకు కొత్త చొక్కా
కుట్టించి తొడుగుతూ కళ్ళలో నీళ్ళు నింపుకునేది. కాలేజీలో
జీతం కట్టడానికి డబ్బిచ్చేటప్పుడు ఆమె చేతులతో ఇంకొకరి
అభాగ్య జీవితం తలచుకొని వణికేవి. పండుగరోజు పది పిండి
వంటలు చేసి నాప్లేట్ నిండా వడ్డించి సంతృప్తిపడే అమ్మ
కళ్ళలో బలంగా అసంతృప్తి కూడా చూడగలిగేదాన్ని నేను.
ఒకరోజు నా డిగ్రీ కాగితం పట్టుకువచ్చి ఆమె చేతిలో
పెడితే ఆనందంతో ఆశీర్వదించి, చటుక్కున కూలబడిపోయి
వెక్కి వెక్కి ఏడ్చింది. ఎన్నని చెప్పను, పిన్నీ! ఇంకా
ఇంకా ఎన్నెన్ని నిదర్శనాలు కావాలి నీకు? నా బాధ ఇంకా
నీకెలా అర్థమయ్యేలా చెప్పేది? ముద్దు పెట్టుకోబోయి చెంప

మీద ఫెళ్ళున కొడితే ఎలా వుంటుంది నీకు? అచ్చు... అచ్చు అలాగే అనుభవించేదాన్ని, పిన్నీ!"

ఆమె కళ్ళలో క్షణ క్షణానికీ మారే రంగులను చూస్తున్నాను నేను.

"అదీగాక... అదీగాక... అమ్మ నాకోసం చేసిన ప్రతి పనిని బాధ్యతగా, నిస్వార్థంగా, మంచితనంతో చేసింది. మమకారంతోమాత్రం కాదు."

నిట్టూర్చింది జ్యోతి.

జ్యోతి ధోరణి ఆపాలనే ఉద్దేశంతో అన్నాను నేను.

"నువ్వు అమ్మను బాగా అర్థం చేసుకో లేదు పాపా!"

జాలిగా నవ్వింది జ్యోతి.

"తల్లిని ఎవరయినా అర్థం చేసుకోక పోవచ్చు కానీ బిడ్డ అర్థం చేసుకోలేదంటే నేను నమ్మను, పిన్నీ! ఆమె అనురాగంలో, మమకారంలో లోపాలు తెలియవంటావా, పిన్నీ!"

నేను మాట్లాడలేదు. ఆ పిల్ల అంత గట్టిగా, నమ్మకంగా చెబుతున్నప్పుడు నేనేమని సమర్థించగలను?

చాలాసేపు మా ఇద్దరిమధ్యా మౌనంగా రాజ్యం ఏలింది. మా మౌనంలో ప్రశాంత లోకాన్నంతా చీకటి కమిటితో కప్పేసింది. లైటు వేసుకుంటే ఒకరి భావాలు ఒక

రికి తెలిసిపోతాయేమోనని భయపడి మేము లైటన్నా వేసుకోకుండా ఆ చీకట్లోనే కూర్చున్నాం. చీకటి ఆమె కన్నీటిని దాచినా ఆమె విడిచిన నిట్టూర్పును మాత్రం నా చెవులు పసిగట్టాయి.

"నేనెంత అదృష్టవంతురాలినంటే విన్నీ! నేను మాతృ విహీనను కాకుండానే ఇద్దరిలో ఏ ఒక్కరూ నన్ను బిడ్డగా గుర్తించడానికి ఇష్టపడటం లేదు. ఏ దేవత శాపమోగాని, సృష్టిలోకెల్లా తీయని వాత్సల్యం నా కందకుండా పోయింది."

"ఈ డబ్బు, సంగీతం, ఈ చదువులు, ఈ పేరు గాదు—నేను కోరుకుంది. పెద్దగా నాకు కోరికలంటూ ఏమీ లేవు కూడా. అయినా నాపుట్టుకే సమస్య అయిపోయింది. కన్న తల్లి గుండెల కంటుకుపోయి పాలుతాగే భాగ్యమే లేక పోయింది. ఆమె కళ్ళలో అనుమానాలు చూచే దౌర్భాగ్యం మాత్రం దక్కింది." వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దానికి ఉలిక్కి పడ్డాను నేను. ఆ విధివంచితను, ఒళ్ళోకి లాక్కుని తల నిమురుతూ కూర్చున్నాను. కొద్దిసేపు అయ్యాక పక్కనున్న జ్యోతి వీపు రాస్తూ అన్నాను;

"నువ్వే విజయ బిడ్డవని మేమందరం నమ్ముతున్నాం. కాని లోపల నాటుకుపోయిన నమ్మకంమీద భ్రమ వదలని నీ తల్లిలో కొద్దిపాటి దౌర్బల్యం ఉంది. అంతమాత్రాన నీ తల్లిని అసహ్యించుకోకు, పాపా!"

వినకూడని మాటలు విన్నట్టు చలించిపోయి తొందరగా అంది "లేదు, లేదు పిన్నీ!"

"నేను కళ్ళు తెరిచినప్పటినుండి నాకు తెలిసిన అమ్మ ఈమే: ఈమె తప్ప నాకింకెవరూ అమ్మ కావడానికి వీల్లేదు,

"అం..తే...అయితే?"

"అనుమానాలు వద్దు పిన్నీ! నువ్వు కూడా నన్ను అదృష్టవంతురాలినంటుంటే ఇంతకాలం దాచుకొన్న అశాంతిని ఈ బలహీనమైన క్షణంలో నీముందు కరిచేశాను అంతే... ఈ విషయం నాకు తెలిసినట్టు అమ్మకు తెలియనీకు, పిన్నీ! "అని అడిగింది. నిజానికి అమ్మ చాలా దురదృష్టవంతురాలు. ఒకటికాదు, రెండుకాదు- పాతికేళ్ళుగా ఆమె ఈ అశాంతిని భరిస్తూనే వుంది. లోకం దృష్టిలో ఒక బిడ్డ కలదై వుండి కూడా ఇన్నేళ్ళూ మనసునిండా శూన్యం నింపుకొని ఒంటరిగా బ్రతికింది. నా దృష్టిలో ఆమెకు బిడ్డలేదు. ఎంత దయనీయమైన స్థితి అది? ఒకరికి చెప్పుకునే దురదృష్టం కాదిది... నేనెప్పుడనుకుంటున్నాను. "నా జన్మవల్లే అమ్మకెంత అశాంతి కదా!" అని."

నేను ఆశ్చర్యపోయాను. ఈ పసిపిల్ల ఇంతటి ఔన్నత్యాన్ని ఎక్కడ దాచుకుంది? ఉన్నట్టుండి అంది జ్యోతి.

"ఒక్కమాట చాలు. పిన్నీ ఒక్కమారు మనసారా, తన కూతురని నన్ను తన గుండెలకు హత్తుకో గలిగితే,

ఏ దేవతయినా సరే అమ్మ మనసు మార్చగలిగితే... ఆ అదృష్టం కొరకు ఎదురు చూస్తున్నాను, 'పిన్నీ' కళ్ళనిండా కోరికలు నింపుకొని నా వైపు చూస్తున్న జ్యోతిని మనసులోనే ఆశీర్వదించాను- 'ఆ బంగారుక్షణం నీకు తప్పకుండా వస్తుంది జ్యోతీ' అని.

పాతిక సంవత్సరాల వెనక్కి వెళ్ళి ఒక క్షణం ఆలోచిస్తే చాలా చిత్రంగా ఉంటుంది. జ్యోతి యీ భూమి మీద పడ్డప్పుడు అనుకున్నాను నేను- "ఏ బిడ్డ అయితే ఏమి, విజయ పిచ్చిదై పోకపోతే!" అని కాని, మాతృత్వంలో ఇన్ని అనుభూతులు ఉంటాయని, ఆ అనుభూతి తాలూకు కర్తవ్యపాలనం ఇంత కష్టంగా ఉంటుందని నాకు తెలియదు అప్పుడు.

పుట్టిననాడే దురదృష్టవంతురాలయిన జ్యోతి కొరకే ఆ అదృష్ట క్షణాల కొరకు తిరిగి ఎదురుచూడడం మొదలెట్టాను. ఇక్కడితో ఆగిపోయిందనుకున్న నా నిరీక్షణ తిరిగి మొదలయింది.

] — [